# నకిలీ పత్తి విత్తనాల కలకలం.. నిందితుడి అరెస్ట్!

- ఇప్పల బోగడలో 316 కిలోల నకిలీ విత్తనాలు స్వాధీనం
- ఏడు సంచుల్లో ఉన్న 9.48 లక్షల రూపాయల విలువైన సరుకు జప్తు
- దళారుల మాయమాటలు నమ్మవద్దని పోలీస్ ఉప కమిషనర్ భాస్కర్ సూచన




**వేల్పుల నగేష్, జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గం భీమారం గ్రామంలోని ఇప్పల బోగడలో పోలీసులు, వ్యవసాయ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. ఒక వ్యక్తి తన ఇంట్లో ప్రభుత్వం నిషేధించిన నకిలీ పత్తి విత్తనాలను నిల్వ ఉంచినట్లు అందిన నమ్మదగిన సమాచారంతో భీమారం సబ్ ఇన్‌స్పెక్టర్ ఏ. రాజేందర్, మండల వ్యవసాయ అధికారి సుధాకర్ తమ సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో నిందితుడి ఇంట్లో నకిలీ పత్తి విత్తనాలతో ఉన్న 7 సంచులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

### అధిక లాభాల ఆశతో మోసాలు

పోలీసులు పంచుల సమక్షంలో నిందితుడిని విచారించగా, అతని పేరు పెనుకుల రవి (40), వృత్తిరీత్యా వ్యవసాయం చేస్తూ ఇప్పల బోగడలోనే నివసిస్తున్నట్లు తెలిపాడు. గత సంవత్సరం నుంచి అతనికి రెండవ, మూడవ నిందితులతో పరిచయం ఏర్పడిందని, అధిక లాభాలు వస్తాయనే ఆశతో నకిలీ విత్తనాల వ్యాపారంలోకి దిగినట్లు ఒప్పుకున్నాడు. గత నెల ఏప్రిల్‌లో వారి వద్ద నుంచి కిలో 1,500 రూపాయల చొప్పున నకిలీ విత్తనాలను కొనుగోలు చేసి, రైతులకు అధిక దిగుబడి వస్తుందని నమ్మబలికి కిలో 3,000 రూపాయల చొప్పున విక్రయించినట్లు అంగీకరించాడు. ఎవరికీ అనుమానం రాకుండా ఆటోలో మూడు విడతలుగా 150 కిలోల విత్తనాలను రవాణా చేశానని, ఈ నెల 12న మూడవ నిందితుడికి 80,000 రూపాయలు ముందస్తుగా ఇచ్చి మరో 200 కిలోలు తెప్పించినట్లు తెలిపాడు. ఆ విత్తనాలు చేరిన మరుసటి రోజే రైతులకు అమ్మేందుకు సిద్ధమవ్వగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న 316 కిలోల విత్తనాల విలువ 9,48,000 రూపాయలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

### నకిలీ విత్తనాలతో తీవ్ర నష్టాలు

నకిలీ పత్తి విత్తనాలు వాడటం వల్ల భూమి సారవంతత దెబ్బతింటుందని, భవిష్యత్తులో పంట దిగుబడులు పూర్తిగా తగ్గిపోతాయని అధికారులు హెచ్చరించారు. ఈ విత్తనాల వల్ల పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడటంతో పాటు రైతులకు చర్మ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. రైతులు ప్రభుత్వం ఇచ్చిన విత్తనాలనే వాడాలని, అనుమతి పొందిన ఎరువుల దుకాణాల్లోనే కొనుగోలు చేసి తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు రహస్యంగా ఉంచుతామని మంచిర్యాల పోలీస్ ఉప కమిషనర్ ఏ. భాస్కర్ తెలిపారు.

### చాకచక్యంగా వ్యవహరించిన సిబ్బందికి అభినందనలు

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు ఈ దాడిలో చాకచక్యంగా వ్యవహరించిన భీమారం సబ్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్, హెడ్ కానిస్టేబుల్ పి. మల్లయ్య, కానిస్టేబుళ్లు కే. రమేష్, ఎన్. మహేందర్, జయకృష్ణ, ఎన్. అశోక్, హోమ్‌గార్డులు సదాశివ్, సంతోష్, శ్యామ్‌లను ఉన్నతాధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల పోలీస్ ఉప కమిషనర్ ఏ. భాస్కర్, జైపూర్ సహాయ పోలీస్ కమిషనర్ ఏ. వెంకటేశ్వర్, జైపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కే. నవీన్ కుమార్, జైపూర్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎల్. భూమేష్ పాల్గొన్నారు.

# మామిడి ప్రదర్శన అద్భుతం!

## వజ్రోత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణ

## తోటల విస్తీర్ణంతోనే అధిక ఆదాయం



**సంగారెడ్డి (జనం పవర్ ప్రతినిధి):**

ఉద్యాన శాఖ అందిస్తున్న ప్రోత్సాహక పథకాలను రైతులు సద్వినియోగం చేసుకొని పండ్ల తోటల విస్తీర్ణాన్ని పెంచుతూ అధిక ఆదాయం పొందాలని ఆ శాఖ రాష్ట్ర సంచాలకులు షేక్ యాస్మిన్ భాష సూచించారు. సంగారెడ్డిలోని ఫల పరిశోధన కేంద్రంలో నిర్వహించిన వజ్రోత్సవ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన మామిడి ప్రదర్శనను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు.

### ప్రత్యేక ఆకర్షణగా వివిధ రకాలు

ఈ వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన మామిడి ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. ఫల పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో విభిన్న రకాల మామిడి పండ్లను ప్రదర్శించగా.. మెదక్, సంగారెడ్డి, సిద్ధిపేట జిల్లాల నుంచి అధిక సంఖ్యలో రైతులు తరలివచ్చి ఆసక్తిగా తిలకించారు. పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను ఉపయోగించుకుని రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలని యాస్మిన్ భాష కోరారు.

### ఎగుమతులతో అధిక లాభాలు

జిల్లా ఉద్యాన అధికారి పి. సోమేశ్వరరావు మాట్లాడుతూ, సంగారెడ్డి జిల్లాలో సుమారు 16 వేల ఎకరాల్లో మామిడి సాగు జరుగుతోందని వెల్లడించారు. రైతులు ఆధునిక సాంకేతిక పద్ధతులను అనుసరిస్తూ నాణ్యమైన దిగుబడి సాధిస్తే.. విదేశాలకు ఎగుమతి చేసి మంచి లాభాలు గడించవచ్చన్నారు. ఫల పరిశోధన కేంద్రం ప్రతి ఏటా సుమారు రెండు లక్షల నాణ్యమైన మొక్కలను రైతులకు అందజేస్తోందని, ఈ కేంద్రం తెలంగాణ రాష్ట్రానికే ఒక విలువైన ఆస్తి అని కొనియాడారు. ఈ వేడుకల్లో పి. సురేష్, డాక్టర్ కె. వెంకటలక్ష్మి, డాక్టర్ బాబు, డాక్టర్ ఏ. కిరణ్ కుమార్ పాల్గొన్నారు. అలాగే శాస్త్రవేత్తలు మౌనిక, నవీన్, నితీష్ కుమార్, ఉద్యాన అధికారులు, విస్తరణాధికారులు, బిందు సేద్యం, గోద్రెజ్ ఆగ్రోవేట్ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.








# బాధితులకు ప్రణవ్ బాబు పరామర్శ!

### మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా

### రోడ్డు ప్రమాదంలో కన్నుమూసిన సలీమ్ పాషా



**జమ్మికుంట (జనం పవర్):** జమ్మికుంట మున్సిపాలిటీ ఒకటవ వార్డు ధర్మారం నివాసి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎండి సలీమ్ పాషా ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్ బాబు సోమవారం మృతుడి నివాసానికి వెళ్లారు. సలీమ్ పాషా కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆయన, వారికి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా ప్రణవ్ బాబు మాట్లాడుతూ, సలీమ్ పాషా మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. విపత్కర పరిస్థితుల్లో ఉన్న బాధిత కుటుంబానికి పార్టీ పరంగా అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇస్తూ ధైర్యం చెప్పారు. ఈ పరామర్శ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బొమ్మ శ్రీరామ్ చక్రవర్తికి ఘనసన్మానం!

### మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్‌కు అభినందనలు

### ఐక్యత, సంక్షేమానికి పాటుపడాలని నాయకుల పిలుపు



**జమ్మికుంట (జనం పవర్):** తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సహకార కార్పొరేషన్ చైర్మన్‌గా కరీంనగర్ పట్టణానికి చెందిన బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి నియమితులయ్యారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పద్మనగర్‌లో గల ఇందిరా గార్డెన్స్‌లో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ సభలో జమ్మికుంట మున్నూరు కాపు సంక్షేమ సంఘం నాయకులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. మున్నూరు కాపుల ఐక్యతకు, సంక్షేమానికి, సమాజ అభివృద్ధికి శ్రీరామ్ చక్రవర్తి నిరంతరం పాటుపడాలని ఈ సందర్భంగా నాయకులు కోరారు. నూతన చైర్మన్ నాయకత్వంలో కార్పొరేషన్ ద్వారా సమాజంలోని పేదలకు మరిన్ని మంచి అవకాశాలు దక్కుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నగంటి మల్లయ్య, జమ్మికుంట అర్బన్ అధ్యక్షులు ఏ బూసి శ్రీనివాస్ పాల్గొన్నారు. వీరితో పాటు సీనియర్ నాయకులు సాయిని రవి, పొన్నగంటి రవీందర్, ఏ బుషి ఓదెలు, మర్రి తిరుపతి, ఏ బూసి సంపత్, రాకేష్ తో పాటు పలువురు సంఘ ప్రతినిధులు హాజరయ్యారు.

# శ్రీరామ్ చక్రవర్తికి ఘనసన్మానం!

### కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన ఇంగిలే రామారావు

### కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని పిలుపు

**జమ్మికుంట (జనం పవర్):** కరీంనగర్ ఇందిరా భవన్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ఒక ముఖ్య పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులై కరీంనగర్‌కు మొదటిసారి వచ్చిన బొమ్మ శ్రీరామ్ చక్రవర్తిని ఇల్లందకుంట శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థాన చైర్మన్ ఇంగిలే రామారావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.

### కుల ఐక్యతకు పాటుపడాలి

ఈ సందర్భంగా దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు మాట్లాడుతూ, బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి భవిష్యత్తులో ఇంకా మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. మున్నూరు కాపు కుల ఐక్యత కోసం, వారి సర్వతోముఖాభివృద్ధి కొరకు నిరంతరం పాటుపడాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న ప్రజా పాలన కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ, పార్టీ బలోపేతం కోసం ప్రత్యేకంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సన్మాన కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా సెక్రెటరీ మేకమల్ల అశోక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పూదరి శివకుమార్ గౌడ్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఉమ్మడి సందీప్ తో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రతి ఇల్లూ సర్వే చేయాలి!

**జనగణనలో తప్పులకు తావివ్వద్దు.. దండేపల్లి తహసీల్దార్ రోహిత్ ఆదేశం**



**దండేపల్లి, ఏప్రిల్ 18 (జనం పవర్):** జన గణన 2027 ప్రక్రియలో భాగంగా ఎలాంటి లోపాట్లు జరగకుండా ఖచ్చితమైన వివరాలను సేకరించాలని దండేపల్లి తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే గణన సిబ్బందికి సూచించారు. సర్వేలో ఒక్క ఇల్లు కూడా మిస్ కాకుండా చూడాలని స్పష్టం చేశారు. దండేపల్లి మండల కేంద్రంలో చేపట్టిన ఇళ్ల గణన ప్రక్రియను తహసీల్దార్‌తో పాటు ఎంపీడీవో జే. ప్రసాద్ క్షేత్రస్థాయిలో పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇళ్ల గణనను అత్యంత సమర్థవంతంగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. భవిష్యత్తులో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల సరైన అమలుకు ఈ జనగణన సర్వే చాలా ప్రధానమైనదని వివరించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేసి సర్వేను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ భూమన్న, ఏఎస్ఓ రమేష్, సూపర్‌వైజర్ రాజన్న, గణన సిబ్బంది నర్సయ్య పాల్గొన్నారు.

# ధాన్యం కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ!

**అలియాబాద్, కంది గ్రామాల్లో ఏర్పాట్ల తనిఖీ**

**రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశం**



**సంగారెడ్డి, మే 18 (జనం పవర్ ప్రతినిధి):** ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. కొండాపూర్ మండలంలోని అలియాబాద్, కంది గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో పాటు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి సమస్యలు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ రెవెన్యూ, వ్యవసాయ, పోలీస్ తదితర శాఖలు పరస్పర సహకారంతో పనిచేయాలని సూచించారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద పోలీస్ శాఖ తరఫున అన్ని రకాల భద్రతా ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. అవసరాన్ని బట్టి రవాణా వాహనాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన ధాన్యాన్ని అక్రమంగా తెలంగాణలో విక్రయించకుండా సరిహద్దు తనిఖీ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వెల్లడించారు. అధికారులు శాంతిభద్రతలను పరిరక్షిస్తూనే రైతుల ప్రయోజనాలను కాపాడేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ స్పష్టం చేశారు.

# బుధేరలో బసవేశ్వర విగ్రహ ఆవిష్కరణ!

**ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎంపీ బీబీ పాటిల్**

**బసవేశ్వరుని ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలి**



**మునిపల్లి (జనం పవర్):** మునిపల్లి మండలంలోని బుధేర గ్రామంలో శ్రీ మహాత్మా బసవేశ్వర విగ్రహ ఆవిష్కరణ మహోత్సవ కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మహాత్మా బసవేశ్వరుల సమాజ సేవలను ఘనంగా స్మరించుకున్నారు. సమాజంలో సమానత్వం, నీతి, మానవతా విలువల స్థాపన కోసం బసవేశ్వరులు చేసిన కృషి చిరస్మరణీయమని బీబీ పాటిల్ పేర్కొన్నారు. నేటి తరం, ముఖ్యంగా యువత ఆయన చూపిన మార్గాన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ వేడుకలు గ్రామంలో ఎంతో భక్తి శ్రద్ధల మధ్య సాగాయి. ఈ మహోత్సవంలో వీరశైవ సమాజం జిల్లా అధ్యక్షుడు ఇప్పపల్లి నర్సింహులు, సంగారెడ్డి నియోజకవర్గ సెక్రెటరీ పట్లోల్ల శివకుమార్ పాల్గొన్నారు. వీరితో పాటు సదాశివపేట తాలూకా అధ్యక్షుడు పట్లోళ్ల నాగేశ్వర్ పాటిల్, సమాజ ప్రతినిధులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# హామీల అమలులో సర్కార్ విఫలం!

- **30న కరీంనగర్‌లో 'రైతు మహాగర్జన'**
- **2 లక్షల మందితో సభకు సన్నాహాలు**



**సిద్దిపేట (జనం పవర్ ప్రతినిధి):**

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని రైతు ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు ఆరోపించారు. ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా, రైతుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈ నెల 30న కరీంనగర్‌లో రెండు లక్షల మందితో రాష్ట్ర స్థాయి "రైతుల మహా గర్జన సమరభేరి" సభను పార్టీలకతీతంగా భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిద్దిపేటలో జిల్లా రైతు ప్రజాసంఘాల నాయకులతో కలిసి రాష్ట్ర అధ్యక్షుడు గూదూరి స్వామి రెడ్డి సమక్షంలో సమరభేరి సభ ఏర్పాట్లపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవాణా, రైతుల సమీకరణ వంటి వివిధ అంశాలపై కోఆర్డినేటర్లతో సమీక్ష జరిపారు. అనంతరం ఈ సభకు సంబంధించిన ఆహ్వాన ప్రతులను నాయకులు ఆవిష్కరించారు.

## నెరవేరని రుణమాఫీ, రైతు భరోసా

ఈ సందర్భంగా పోలాడి రామారావు మాట్లాడుతూ, రెండు లక్షల రూపాయల రుణమాఫీని సగం మంది రైతులకే పరిమితం చేశారని, మిగతా అర్హులైన రైతులకు ఎందుకు పూర్తి చేయడం లేదని ప్రశ్నించారు. అన్ని పంటలకు 500 రూపాయల బోనస్ ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం కొంతమేరకే అమలు చేస్తోందని విమర్శించారు. యాసంగి సీజన్ ముగియబోతున్నా రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు పూర్తిగా జమ కాలేదని, సాగు ప్రారంభ సమయంలోనే ఈ సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిలిచిపోయిందని, జాబ్ క్యాలెండర్ ఊసే లేదని మండిపడ్డారు.

## పెన్షన్, బీమా వయోపరిమితి పెంచాలి

పాల ఉత్పత్తిదారులకు గతంలో ఇచ్చిన లీటరుకు 4 రూపాయల రాయితీని ఎందుకు నిలిపివేశారో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మిల్లర్లు, కింది స్థాయి సిబ్బంది కుమ్మక్కై తేమ, తాలు పేరుతో క్వింటాల్‌కు 6 నుండి 8 కిలోల వరకు కోత విధిస్తూ రైతులను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 50 ఏళ్లు నిండిన ప్రతి రైతుకు నెలకు 6 వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని, రైతు బీమా వయోపరిమితిని 59 నుంచి 70 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు వన్యాల భూపతి రెడ్డి, అయిత నాగరాజు, వేణుగోపాల్ రెడ్డి, హంసకేతన్ రెడ్డి, అశోక్, దేవేందర్ రావు, రాజునాయక్, గోవర్ధన్ రెడ్డి, వెంకటేశ్వర్ రావుతో పాటు వివిధ మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# జీసీసీ ఆపరేటర్ల ఆవేదన!

- **వేతనాలు పెంచాలని ఐటీడీఏ పీఓకు వినతి**
- **కనీస వేతనం 15 వేలు ఇవ్వాలని డిమాండ్**



**తుడుం జితేందర్,జనం పవర్,ఉత్తర తెలంగాణ బ్యూరో**

సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ), గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ ఇంధన కేంద్రాలలో విధులు నిర్వహిస్తున్న ఆపరేటర్ల సమస్యలపై ఐటీడీఏ కార్యాలయంలో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. తమకు నెలకు కనీస వేతనం 15,000 రూపాయలకు పెంచి ఆర్థికంగా ఆదుకోవాలని కోరుతూ వివిధ మండలాలకు చెందిన కార్మికులు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి మంద మకరంద్ ఐఏఎస్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

## చాలీచాలనీ జీతాలు

ఈ సందర్భంగా ఆపరేటర్ల న్యాయమైన డిమాండ్లకు జాతీయ మానవ హక్కుల కమిటీ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా చైర్మన్ రాథోడ్ రమేష్ పూర్తి మద్దతు ప్రకటించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఐటీడీఏ జీసీసీ పరిధిలో గత ఆరేళ్లుగా కార్మికులు అత్యంత తక్కువ వేతనంతో బతుకీడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వీరికి నెలకు కేవలం 8,500 రూపాయలు మాత్రమే ఇస్తున్నారని, ప్రస్తుత కాలంలో ఈ చాలీచాలనీ జీతంతో కుటుంబాలను పోషించడం, పిల్లలను చదివించుకోవడం అత్యంత భారంగా మారిందని పేర్కొన్నారు.

## రాత్రింబవళ్లు డ్యూటీలు

ఇంధన కేంద్రాలలో పనిచేసే ఆపరేటర్లు రాత్రింబవళ్లు కష్టపడుతూ, అత్యంత ప్రమాదకరమైన వాతావరణంలో విధులను నిర్వహిస్తున్నారని రాథోడ్ రమేష్ అన్నారు. వీరు పడుతున్న శ్రమకు కనీసం రోజువారీ కూలీ కూడా గిట్టని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్న ఈ రోజుల్లో 8,500 రూపాయలతో నెట్టుకురావడం సాధ్యం కాదన్నారు.

## ఉద్యోగ భద్రత కల్పించాలి

కార్మికులకు రోజుకు కనీసం 500 రూపాయల చొప్పున కూలీ గిట్టుబాటు అయ్యేలా నెలవారీ వేతనాన్ని 15,000 రూపాయలకు పెంచాలని, ఎన్నో ఏళ్లుగా నమ్ముకుని పనిచేస్తున్న వారికి పూర్తి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి మంద మకరంద్, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సానుకూలంగా స్పందించాలని కోరారు. మానవతా దృక్పథంతో ఆలోచించి ఆపరేటర్ల వేతనాలను పెంచి వారి... కుటుంబాలలో వెలుగులు నింపాలని రాథోడ్ రమేష్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన పలువురు కేంద్రాల ఆపరేటర్లు, కార్మిక ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజావాణి సమస్యలు వెంటనే పరిష్కరించాలి!

- **అధికారుల సమన్వయంతోనే సాధ్యం: కలెక్టర్ కుమార్ దీపక్**
- **ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశం**



**వేల్పుల నగేష్, జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తుల పరిష్కారంపై అధికారులు సమన్వయంతో కృషి చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి. చంద్రయ్య, వి. రాములులతో కలిసి ఆయన అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ ప్రజావాణిలో మొత్తం 64 దరఖాస్తులు అందాయని, ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో పలువురు బాధితులు తమ సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రాలు సమర్పించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన పర్వీన్ సుల్తానా, ఫర్జానా నిరుపేద అయిన తమకు రెండు పడక గదుల ఇల్లు మంజూరు చేయాలని కోరారు. కమ్మరి రాజేశ్వరి ఒంటరి మహిళ పింఛన్ ఇప్పించాలని, ముజ్జిగ స్వప్న ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని దరఖాస్తు చేసుకున్నారు. బెల్లంపల్లి మండలం చాకేపల్లి గ్రామస్థులు తమ గ్రామంలోని షెడ్యూల్డ్ కులాల నేతకాని గూడెంలో మంజూరైన బోరు బావి ఏర్పాటు చేయాలని కోరారు. జన్నారం మండలం వినాయక నగర్ కాలనీవాసులు ఇండ్ల మధ్యలో ఉన్న బీడీ ఫ్యాక్టరీని తొలగించాలని, దండేపల్లి మండలం మాకులపేట గ్రామానికి చెందిన ముత్తినేని రాజమణి అడవి పందుల వల్ల నాశనమైన తన మొక్కజొన్న పంటకు నష్టపరిహారం ఇప్పించాలని అర్జీలు సమర్పించారు.

## ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి

మండల ప్రత్యేక అధికారులుగా నియమించబడిన జిల్లా అధికారులు తమ మండలాల పరిధిలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేస్తోందని, సేకరించిన ధాన్యాన్ని సకాలంలో రైస్ మిల్లులు, గోదాములకు తరలించాలన్నారు. దిగుమతి, హమాలీల సంఖ్య పెంపుదల అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

## పోస్టర్ల ఆవిష్కరణ

అనంతరం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా పర్యాటక రంగం ఆధ్వర్యంలో నిర్వహించవలసిన కార్యక్రమాల కరపత్రాలను, గిరిజనుల సంక్షేమం కోసం దేశవ్యాప్తంగా చేపట్టిన జన జాతీయ గరిమ ఉత్సవ్ 2026 గోడ ప్రతులను అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. యువ టూరిజం క్లబ్, అవగాహన కార్యక్రమాలు, హెరిటేజ్ వాక్, స్థానిక ఇన్‌ఫ్లుయెన్సర్లు, యూట్యూబర్లతో సమావేశం, స్వచ్ఛత, టూరిజం బ్రాండ్ విడుదల వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. గిరిజన గ్రామాలలో రహదారులు, తాగునీరు, ఆరోగ్యం, విద్యుత్, ఇండ్ల నిర్మాణం వంటి కనీస సదుపాయాలు కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

- డ్రాగన్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో బెల్ట్ టెస్ట్
- విజేతలకు బెల్టులు, సర్టిఫికెట్ల ప్రదానం



**జమ్మికుంట, మే 18 (జనం పవర్):** జమ్మికుంట పట్టణంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా డ్రాగన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఇండియా ఆధ్వర్యంలో కరాటే విద్యార్థులకు గ్రేడింగ్ బెల్ట్ టెస్ట్ నిర్వహించారు. ఈ పరీక్షల్లో కటాస్, పంచ్, స్పారింగ్, అఫెన్స్, డిఫెన్స్, బ్లాక్ వంటి వివిధ విభాగాల్లో దాదాపు రెండు గంటల పాటు పోటీలు జరిగాయి. విద్యార్థులు తాము నేర్చుకున్న కరాటే విద్యను ప్రదర్శించిన తీరు వీక్షకులను అబ్బురపరిచింది. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సుంకరి యాదయ్య (హన్షీ) చేతుల మీదుగా బెల్టులు, ధ్రువపత్రాలు అందజేశారు. ఎల్లో బెల్ట్ విభాగంలో సాహితీ మాధవి, పారుపల్లి సంగీత, సాయి హర్షిత్ విజేతలుగా నిలిచారు. గ్రీన్ బెల్ట్ విభాగంలో త్రివేద్, త్రినాధ్.. బ్లూ బెల్ట్ విభాగంలో మనస్విని, నిత్యశ్రీ.. బ్రౌన్ బెల్ట్ విభాగంలో వైష్ణవి, సాయి గణేష్‌లు అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చి ఉన్నత బెల్టులను కైవసం చేసుకున్నారు.

### కఠిన సాధనతోనే ఉన్నత స్థానాలు

అనంతరం మాస్టర్ యాదయ్య మాట్లాడుతూ, పిల్లలు విద్యార్థి దశ నుంచే కరాటేలో కఠిన సాధన అలవర్చుకోవాలని సూచించారు. నిరంతరం శ్రమిస్తూ పోటీల్లో ప్రతిభ చాటితే ఎల్లో, గ్రీన్, బ్లూ, బ్రౌన్ బెల్టులతో పాటు అత్యున్నతమైన బ్లాక్ బెల్ట్, రెడ్ బెల్ట్ పొందే అవకాశం ఉంటుందన్నారు. ఈ ఉన్నత స్థాయిలను సాధించడానికి మరింత కఠినమైన శిక్షణ అవసరమని వివరిస్తూ, విద్యార్థులకు తన ప్రోత్సాహం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కరాటే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# వీరేశం దంపతులకు ఘన సన్మానం!

- ఓడీఎఫ్ ఉద్యోగి పదవీ విరమణ వేడుక
- వీరశైవ సమాజం ఆధ్వర్యంలో సత్కారం

**సంగారెడ్డి (జనం పవర్):** ఓడీఎఫ్ ఉద్యోగి పదవీ విరమణ సందర్భంగా నిర్వహించిన ఒక కార్యక్రమంలో నెలిగ వీరేశం ప్రమీల దంపతులను వీరశైవ సమాజం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు ఇప్పపల్లి నర్సింలు నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమం ఎంతో ఆత్మీయ వాతావరణంలో సాగింది. ఉద్యోగ జీవితంలో ఆయన అందించిన ఉత్తమ సేవలను కొనియాడుతూ శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.

### నిబద్ధతతో కూడిన సేవలు

ఈ సందర్భంగా మాట్లాడిన సమాజ ప్రతినిధులు, వీరేశం తన విధుల్లో నిబద్ధతతో పనిచేస్తూ ప్రజలకు ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. వీరశైవ సమాజ పురోగతికి ఆయన చేసిన కృషిని గుర్తుచేసుకున్నారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆయన ప్రజా సేవలో, సమాజ శ్రేయస్సు కోసం చురుకుగా పాల్గొంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు, బసవ భవన్ చైర్మన్ మధుశేఖర్, జిల్లా మహిళా సభ్యురాలు అరుణ పాల్గొన్నారు. వీరితో పాటు అందోల్ తాలూకా అధ్యక్షుడు అశోక్, సదాశివపేట మండల అధ్యక్షుడు పట్లోళ్ల నాగేశ్వర్, సమాజ సభ్యులు ప్రశాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొని వీరేశం ప్రమీల దంపతులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.



# దివ్యాంగులు ఉన్నత స్థాయికి ఎదగాలి!

### టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి పిలుపు

### విద్యార్థులకు వినికిడి పరికరాలు, వీల్‌చైర్ల పంపిణీ



**సంగారెడ్డి (జనం పవర్ ప్రతినిధి):** ఆత్మస్థైర్యం, పట్టుదలతో చదివి దివ్యాంగులు ఉన్నత స్థాయికి ఎదగాలని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. సంగారెడ్డి పట్టణంలోని సంజీవ్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యాశాఖ సమగ్ర శిక్ష, అలింకో సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన ఒక కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు వినికిడి పరికరాలు, వీల్‌చైర్లను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ, పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలు అధిరోహించిన ఎంతో మంది దివ్యాంగులు ఈ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. విద్యార్థులు చదువుతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుని జీవితంలో అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను ప్రోత్సహిస్తూ వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనితా సంతోష్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్ పాల్గొన్నారు. వీరితో పాటు కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, కౌన్సిలర్లు సంగీతా మహేష్, యశోద, వివిధ పాఠశాలల విద్యాశాఖ అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డ్వాక్రా మహిళలకే 'హెల్త్ మిషన్-100'!

### ఉచితంగా 30 రకాల వైద్య పరీక్షలు

### ప్రారంభించిన టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల



**కంది (జనం పవర్):** తెలంగాణలోని డ్వాక్రా మహిళల సంపూర్ణ ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వం "హెల్త్ మిషన్-100" అనే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిందని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి తెలిపారు. ఈ పథకం ద్వారా ఉచితంగా 30 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సోమవారం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, కంది మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య పరీక్షల శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. మహిళల్లో సాధారణంగా వచ్చే బీపీ, షుగర్, థైరాయిడ్, రక్తహీనత వంటి సమస్యలను గుర్తించేందుకు ఈ పరీక్షలు ఎంతో తోడ్పడతాయన్నారు. పరీక్షలు పూర్తయిన తర్వాత ప్రతి మహిళకు క్యూఆర్ కోడ్‌తో కూడిన "డిజిటల్ హెల్త్ కార్డ్" రూపొందించి ప్రభుత్వ పోర్టల్‌లో భద్రపరుస్తారని వివరించారు. డిజిటల్ కార్డుల వల్ల భవిష్యత్తులో మహిళలు ఏ ఆసుపత్రికి వెళ్లినా వారి పూర్తి ఆరోగ్య చరిత్ర వైద్యులకు సులభంగా అందుబాటులో ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఈ గొప్ప అవకాశాన్ని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కంది గ్రామ సర్పంచ్ శ్రీరామ్, ఉప సర్పంచ్ ఖాన్, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



